# ముందు మాట

బైబిల్ యొక్క ఈ తర్జుమా సామాన్య ప్రజల, క్రొత్తగా విద్య నేర్చుకొంటున్న వాళ్ళు, మరియు పిల్లల ప్రత్యేక అవసరాల్ని తీర్చడానికి చేయబడింది. దీన్ని మనస్సులో పెట్టుకొని, పెద్ద పెద్ద వాక్యాలు, కఠినమైన మాటలు ఉపయోగించకుండా క్రొత్తగా విద్య నేర్చుకొంటున్నవాళ్ళు సహితం అర్థం చేసుకునేటట్లుగా సులభ భాషలో వాక్య సారాంశం మార్చబడకుండా తర్జుమా చేయబడింది.

పవిత్ర గ్రంథానికి సంబంధించిన ఈ రకమైన భాషాంతరం సిద్ధం చేయడానికి పురికొల్పిన ప్రాథమికమైన ఉద్దేశాలలో ఒకటి ఏమంటే - మంచి అనువాదం అంటే చక్కగా అర్థమయ్యేటట్టు చేయడం. బైబిల్ రచయితల సందేశాన్ని పాఠకుడికి అర్థమయ్యేలా చేయడమే అనువాదకుల ముఖ్యమైన పని. మూల రచనలు ఆ కాలంలోని ప్రజలకు ఎంత శక్తివంతంగా అర్థమయ్యేవో, అలాగే ఈ అనువాదాలు కూడా ఈ కాలంలో అంత శక్తివంతంగా అర్థం కావాలి. సరైన అనువాదం అంటే నిఘంటువులలోని పదాలను వరుసగా కూర్చటం కాదు. మూల సందేశానికి వేలాది సంవత్సరాలకు పూర్వం ఎటువంటి అర్థం, సంబంధం, అభిరుచి, ప్రభావం ఉండేవో, అవన్నీ ఈనాటికీ ఉండేలా చూడాలి.

కాబట్టి ఈ పుస్తకాన్ని అనువదించే వాళ్ళకి దాని సందేశాన్ని శక్తివంతంగా అందించడం చాలా ముఖ్యం. చక్కగా అర్థమయ్యేలా అనువదించటం అనే ఈ కోరిక, మూల వాక్యపు సత్యార్థానికున్న ప్రాధాన్యతను అలక్ష్యం చేయదు. వాక్యపు సత్యార్థం అంటే మూలంలో ఉన్న విషయాలను యథాతథంగా చెప్పడమే కాని, మూలభాషా రూపాల్ని ఉన్నది ఉన్నట్లుగా అనువదించడం మాత్రం కాదు.

పవిత్ర గ్రంథ రచయితలు, ముఖ్యంగా క్రొత్త నిబంధన రచనలను సిద్ధపర్చిన వాళ్ళు ఉపయోగించిన భాషాశైలిని పరిశీలిస్తే, వాళ్ళు, పాఠకులకు చక్కగా అర్థం కావాలనే ఉద్దేశంతోనే వ్రాశారని స్పష్టమౌతుంది. ఈ తెలుగు ప్రతిని అనువదించిన వాళ్ళు ఈ విషయాన్ని తాము పాటించవలసిన ముఖ్యమైన మార్గదర్శినిగా పరిగణించారు. అందువల్ల వాళ్ళు సరళంగానూ, సహజంగానూ ఉండే రూపంలో బైబిల్ పాఠాల అర్థం తమ ప్రియ పాఠకులకు తెలిసేలా చేశారు. బైబిల్‌ను అర్థం చేసుకోవడానికి భాషను అడ్డంకిగా చేయకుండా, వాళ్ళు తెలుగు భాషా ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పవిత్ర గ్రంథాల సత్యాలను తెలుసుకొనే అవకాశం కలిగించారు.

ఈ అనువాదంలో మూలగ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా అనేక ప్రత్యేక పద్ధతులు ఉపయోగించారు. గ్రంథంలో ఉన్న కష్టమైన లేదా అస్పష్టమైన పదాలకు సంక్షిప్త వ్యాఖ్యలు లేదా పర్యాయపదాలను ప్రత్యేక లిపితో కుండలీకరణాల్లో ( ) ఇచ్చారు. పూర్తి వివరణ అవసరమైన పదాలకు, పదబంధాలకు పువ్వు గుర్తు వేసి, పుట క్రింది భాగంలో పాద సూచికలలో వాటిని వివరించారు. అంతేకాకుండా, పవిత్ర గ్రంథంలోని ప్రత్యేక వాక్యభాగాల్ని గుర్తించి, వాటి పాఠాంతరాలను తరచుగా పాదసూచికలో ఇచ్చారు.

# పీఠిక

వాస్తవంగా 'బైబిల్' అను మాట 'పుస్తకాలు' అను అర్థమిచ్చే ఒక గ్రీకు పదం నుండి వచ్చింది. 'నిబంధన' అనే మాట 'ఒడంబడిక', 'ఒప్పందం' అని అర్థమిచ్చే మాటలుగా వాడబడింది. తన ప్రజల్ని దీవించడానికి దేవుడు చేసిన వాగ్దానాన్ని ఇది ప్రస్తావిస్తుంది. యూదులనే ఇశ్రాయేలు ప్రజలతో మోషే కాలంలో దేవుడు చేసిన ఒప్పందాన్ని గురించి వ్రాసిన పుస్తకాల సమూదాయమే పాత నిబంధన. యేసు క్రీస్తు నందు విశ్వాసముంచిన వారందరితో దేవుడు చేసిన ఒప్పందాన్ని గురించి వ్రాయబడిన పుస్తకాల సముదాయమే క్రొత్త నిబంధన.

యూదా ప్రజలతో సంప్రదించుటలో దేవుని క్రియలను గూర్చి పాత నిబంధన లేఖనాలు తెలియపరుస్తవి. సర్వ ప్రపంచానికి ఆయన ఆశీర్వాదాన్ని తేవడానికి ఈ లేఖనాలు దేవుని ప్రణాళికను బయలుపరుస్తవి. దేవుడు తన ప్రణాళికను నెరవేర్చుటకు పంపనైయున్న రక్షకుని (మెస్సియ్య) ఆగమనమునకు ఈ లేఖనాలు ఎదురు చూస్తవి! క్రొత్త నిబంధన లేఖనాలు పాత నిబంధన కథకు ధారావాహికమైనవి. అవి ఆ రక్షకుని (యేసుక్రీస్తు) రాకడను మరియు సర్వమానవ జాతి కొరకు ఆయన రాకడ యొక్క అర్థమును వివరిస్తవి. పాత నిబంధన అవసరమైన పూర్వరంగాన్ని ఇచ్చుటకు మరియు క్రొత్త నిబంధనను అర్థము చేసుకోవడానికి ముఖ్యమైనది. పాత నిబంధనలో ప్రారంభమైన రక్షణ కథను క్రొత్త నిబంధన పూర్తి చేస్తుంది.

## పాత నిబంధన

పలువురు విభిన్న రచయితలు వ్రాసిన ముప్పైతొమ్మిది విభిన్న గ్రంథాల సంకలనమే పాత నిబంధన భాగమైయున్నది. వీటిని ప్రధానంగా హీబ్రూ అనే ప్రాచీన ఇశ్రాయేలు భాషలో వ్రాశారు. బబులోను (Babylon) సామ్రాజ్యపు రాజ భాష అయిన సిరియా లేక అరామిక్ (Aramaic) భాషలో కూడా కొన్ని భాగాలను వ్రాశారు. పాత నిబంధనలోని భాగాలను మూడువేల ఐదు వందల సంవత్సరాల క్రితం వ్రాశారు. పైగా మొదటి పుస్తకాన్ని వ్రాయడానికి, ఆఖరి పుస్తకాన్ని వ్రాయడానికీ మధ్య వెయ్యి సంవత్సరాలు పైగా గడిచిపోయాయి. ఈ సంకలనంలో న్యాయశాస్త్రం, చరిత్ర, గద్యం, పాటలు, పద్యం, మేధావుల ఉపదేశాలు ఉన్న పుస్తకాలు ఉన్నాయి.

పాత నిబంధన సాధారణంగా మూడు ప్రధాన భాగాలుగా విడదీయబడుతుంది. న్యాయశాస్త్రం, ప్రవక్తలు, పవిత్ర రచనలు. న్యాయశాస్త్రంలో అయిదు పుస్తకాలున్నాయి. వీటికి మోషే (Moses) అయిదు పుస్తకాలు అని పేరు. వీటిలో మొదటి పుస్తకం ఆదికాండం (Genesis). ఇది, మనకు తెలిసిన ఈ ప్రపంచం ఎలా మొదలయిందో అనే విషయాలను గురించీ, మొదటి పురుషుడు(ఆదాము) మొదటి స్త్రీ (హవ్వ) గురించీ, వాళ్లు దేవునికి వ్యతిరేకంగా చేసిన మొదటి పాపాన్ని గురించి చెపుతుంది. ఈ పుస్తకం ఇంకా గొప్ప జలప్రళయం (Great Flood) గురించీ, ఆ జల ప్రళయం నుండి దేవుడు రక్షించిన కుటుంబాన్ని గురించీ, దేవుడు ఒక ప్రత్యేకమైన ప్రయోజనం కోసం తాను ఎన్నుకున్న ప్రజలైన ఇశ్రాయేలు జనాంగం ఎలా మొదలయిందో అనే విషయాన్ని గురించీ చెపుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది అనేక విషయాల ప్రారంభాన్ని తెలియపర్చే పుస్తకం.

## అబ్రాహాం కథ

దేవుడు గొప్ప విశ్వాసియైన అబ్రాహాంతో ఒక ఒప్పందం చేసుకున్నాడు. అబ్రాహాంను ఒక గొప్ప జనాంగానికి మూల పురుషునిగా చేస్తాననీ, అతనికి అతని వంశం వారికి కనాను (Canaan) అనే దేశాన్ని ఇస్తాననీ దేవుడు ఆ ఒప్పందంలో వాగ్దానం చేశాడు. ఆ ఒప్పందానికి గుర్తుగా అబ్రాహాంకు అతని సంతానానికి తమ శరీరంలో సున్నతిని నియమించాడు. దేవునికీ, ఆయన ప్రజలకూ మధ్య జరిగిన ఒప్పందానికి ఈ సున్నతి ఒక నిబంధనగా రూపొందింది. దేవుడు తాను చేసిన వాగ్దానాలను ఎలా నెరవేరుస్తాడో అబ్రాహాంకు తెలియదు. కానీ అబ్రాహాం దేవుణ్ణి నమ్మాడు. దీని వల్ల దేవుడు చాలా సంతోషించి అతన్ని నీతిమంతునిగా చేశాడు.

మెసపొటేమియాలోని హీబ్రూల మధ్యనున్న అతని ఇంటిని వదలి పెట్టవలసిందిగా దేవుడు అబ్రాహాంకు ఆజ్ఞాపించాడు. తాను వాగ్దానం చేసిన ప్రాంతమైన కనానుకు (దీనినే పాలస్తీనా అని కూడా పిలుస్తారు) అతన్ని తీసుకు వెళ్లాడు. ముసలితనంలో అబ్రాహాంకు ఇస్సాకు అనే కొడుకు పుట్టాడు. ఈ ఇస్సాకుకు యాకోబు అనే కొడుకు పుట్టాడు. యాకోబుకు (ఇతన్నే ఇశ్రాయేలు అని కూడా పిలుస్తారు) పన్నెండు మంది కొడుకులు, ఒక కూతురు పుట్టారు. ఈ కుటుంబమే ఇశ్రాయేలు జనాంగంగా మారింది. కాని ఈ జనాంగం తన మూల గోత్రాలను ఎప్పుడూ మరిచి పోలేదు. ఇశ్రాయేలుకు చెందిన పన్నెండు గోత్రాలుగా (లేదా కుటుంబ శాఖలుగా) ఈ జనాంగం తన్ను తాను పేర్కొంటూ వచ్చింది. ఈ పన్నెండు గోత్రాలు, యాకోబు పన్నెండు మంది కొడుకుల పేర్లమీద వచ్చాయి. యాకోబు కొడుకుల పేర్లు: రూబేను, షిమ్యోను, లేవి, యూదా, దాను, నఫ్తాలి, గాదు, ఆషేరు, ఇశ్శాఖారు, జెబూలూను, యోసేపు, బెన్యామీను. వీళ్లకు అబ్రాహాం, ఇస్సాకు, యాకోబు (ఇశ్రాయేలు) అనే ఈ ముగ్గురు మూలపితరులు.

ఇంకొక రకంగా కూడా అబ్రాహాం మూలపురుషుడౌతాడు. ప్రాచీన ఇశ్రాయేలీయులలో చాలాసార్లు దేవుడు కొందర్ని తన వక్తలుగా పిలిచాడు. ఈ వక్తలు లేదా ప్రవక్తలు ప్రజలకు దేవుని ప్రతినిధులుగా ఉండిరి. ఈ ప్రవక్తల ద్వారా దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు వాగ్దానాలు, హెచ్చరికలు, న్యాయసూత్రాలు, ఉపదేశాలు, పాత అనుభవాలనుంచి నేర్చుకొన్న పాఠాలు, జరుగబోయే సంఘటనల మీద ఆధారపడ్డ పాఠాలు ప్రసాదించాడు. హీబ్రూ వాడైన అబ్రాహాం పవిత్ర గ్రంథంలో చెప్పబడిన మొట్టమొదటి ప్రవక్త.

## ఇశ్రాయేలు దాస్య విముక్తి

యాకోబు (ఇశ్రాయేలు) కుటుంబం, అతని స్వంత కుటుంబీకుల్ని కలుపుకొని డెబ్బైకి పెరిగింది. అతని కొడుకులలో ఒకడైన యోసేపు ఈజిప్టులో ఉన్నతాధికారి అయ్యాడు. కరవుకాలం వచ్చింది. అందువల్ల యాకోబు అతని కుటుంబమూ ఈజిప్టుకు కదిలి వెళ్లారు. అక్కడ ఆహారం పుష్కలంగా ఉంది. జీవితం సుఖంగా సాగింది. ఈ హీబ్రూ జాతి ఒక చిన్న జనాంగంగా పెరిగింది. ఈ ప్రజలను ఫరో (ఈజిప్టు రాజు) బానిసలుగా చేశాడు. ఆఖరికి, నాలుగు వందల సంవత్సరాల తర్వాత, దేవుడు, మోషే ప్రవక్తను ఉపయోగించి, ఈజిప్టులో ఉన్న ఇశ్రాయేలు ప్రజలను దాస్య విముక్తులను చేయడం, వాళ్లను తిరిగి పాలస్తీనాకు తీసుకు పోవడం – నిర్గమకాండం (Exodus) అనే పుస్తకంలో ఉంది. ఈ దాస్య విముక్తిమూల్యం చాలా ఎక్కువ. కాని దానిని చెల్లించిన వాళ్లు ఆనాటి ఈజిప్టువాళ్లు. ఫరోకు, ఈజిప్టులోని ప్రజలకు పుట్టిన మొదటి పిల్లలు చనిపోయారు. చివరకు ఫరో ఇశ్రాయేలు ప్రజలను స్వేచ్ఛగా వదిలిపెట్టడానికి అంగీకరించాడు. ఈజిప్టు కుటుంబాలలో మొట్టమొదట పుట్టిన వాళ్ళు చనిపోయాకనే, ఇశ్రాయేలు ప్రజలు స్వేచ్ఛను పొందారు. తరువాత కాలంలో ఇశ్రాయేలు ప్రజలు తాము ఆరాధనల్లోను, బలులివ్వడంలోను, అనేక అనేక విషయాల్లోను ఈ సంఘటన గుర్తుపెట్టుకున్నారు.

ఇశ్రాయేలు ప్రజలు తమ స్వేచ్ఛా ప్రయాణం కోసం సిద్ధమయ్యారు. ఈజిప్టు నుంచి వెళ్ళిపోవడానికి సంసిద్ధులయ్యారు. ప్రతి కుటుంబం ఒక గొర్రె పిల్లను చంపి, దాని మాంసాన్ని నిప్పుల మీద కాల్చారు. ఆ గొఱ్ఱె పిల్ల రక్తాన్ని వాళ్లు దేవునికి ఒక ప్రత్యేకమైన గుర్తుగా తమ తమ గడపల మీద చల్లుకున్నారు. వాళ్లు హడావిడిగా పులువబెట్టకుండా రొట్టెలు కాల్చుకుని భోజనాలు చేశారు. ఆ రాత్రి ఆ ప్రాంతమంతా ప్రభువు దూత సంచరించాడు. గొర్రె పిల్ల రక్తం ఏ గడప మీద లేదో ఆ కుటుంబంలో జ్యేష్ఠ సంతానం చనిపోయింది. ఇశ్రాయేలు ప్రజలు స్వేచ్ఛను పొందారు. కాని ఆ బానిసలు ఈజిప్టును వదలిన తర్వాత ఫరో తన ఆలోచన మార్చుకున్నాడు. ఆ ఇశ్రాయేలు బానిసలను పట్టుకొని తిరిగి వెనక్కి తీసుకు రమ్మని తన సైన్యాన్ని పంపించాడు. కాని దేవుడు తన ప్రజలను రక్షించాడు. ఆయన, ఎఱ్ఱ సముద్రాన్ని చీల్చి, దాని ద్వారా అవతలి గట్టుకు స్వతంత్రులుగా తన ప్రజలను నడిపించాడు. వాళ్లను తరుముకొని వస్తున్న ఈజిప్టు సైన్యం మాత్రం సముద్రంలో మునిగిపోయింది. అప్పుడు సీనాయి ద్వీపకల్పంలోనున్న ఎడారిలోని సీనాయి పర్వతం దగ్గర, దేవుడు ఆ ప్రజలతో ఒక ప్రత్యేకమైన ఒప్పందం చేసుకున్నాడు.

## మోషే శాసనం

దేవుడు ఇశ్రాయేలు ప్రజలను రక్షించడం, సీనాయి దగ్గర వాళ్లతో ఒప్పందం చేసుకోవడం ఇవన్నీ ఈ జనాంగాన్ని వేరే అన్ని జనాంగాల నుండి ప్రత్యేకించాయి. ఈ ఒప్పందంలో దేవుడు ఇశ్రాయేలు ప్రజల కోసం చేసిన వాగ్దానాలు, శాసనాలు ఉన్నాయి. ఈ ఒప్పందంలో ఒక భాగానికి పది ఆజ్ఞలు (Ten Commandments) అని పేరు. వీటిని దేవుడు రెండు రాతి పలకల మీద వ్రాసి తన ప్రజలకిచ్చాడు. దేవుని దృష్టిలో ఇశ్రాయేలు ప్రజలు ఏ విధమైన జీవితాన్ని గడుపుతూ బ్రతకాలో దానికి సంబంధించిన ముఖ్య సూత్రాలు ఈ ఆజ్ఞలలో

ఉన్నాయి. ఇశ్రాయేలీయుడు, అతని కుటుంబం, అతని సహచరుడు – తన దేవుని యెడల జరిగించవలసిన బాధ్యతలు, విధులు అన్ని ఈ ఆజ్ఞలలో ఉన్నాయి.

సీనాయి పర్వతం దగ్గర ఇచ్చిన ఉపదేశాలు, పది ఆజ్ఞలు, మిగిలిన విధులు – అన్నింటినీ కలిపి మోషే ధర్మశాస్త్రం అనీ, లేదా క్లుప్తంగా ధర్మశాస్త్రం అని అంటారు. ఈ మాటలు చాలా సార్లు పవిత్ర రచనలలోని మొదటి ఐదు పుస్తకాలకూ వర్తిస్తాయి. తరచుగా మొత్తం పాత నిబంధన కూడ వర్తిస్తాయి.

మోషే ధర్మశాస్త్రంలో పది ఆజ్ఞలూ, ప్రవర్తనకు సంబంధించిన ఇతర నియమాలు మాత్రమే కాకుండా, యాజకులు, బలులు, ఆరాధనలు, పవిత్ర దినాలు – వీటికి సంబంధించిన నియమాలు కూడా ఉన్నాయి. ఈ నియమాలు లేవీయకాండంలో ఉన్నాయి. మోషే ధర్మశాస్త్రం ప్రకారం యాజకులు, వాళ్ల సహాయకులూ అంతా లేవీ (Levi) అనే గోత్రం నుంచి వచ్చారు. ఈ సహాయకులను లేవీయులు (Levites) అంటారు. చాలా ముఖ్యమైన యాజకుణ్ణి ప్రధాన యాజకుడు (High Priest) అని అంటారు.

ఇశ్రాయేలు ప్రజలు దేవుణ్ణి ఆరాధించడానికి వెళ్ళే పవిత్ర గుడారాన్ని (“Tabernacle”) లేదా సమావేశ గుడారాన్ని (Meeting Tent) ఎలా నిర్మించాలో ఈ ధర్మశాస్త్రంలో చెప్పబడింది. వాళ్ల ఆరాధనా విధానంలో ఉపయోగించే వస్తువులన్నీ ఎలా తయారు చేసుకోవాలో కూడా దాంట్లో చెప్పబడింది. సీయోను పర్వతం మీదనున్న యెరూషలేంలోని పవిత్ర దేవాలయాన్ని నిర్మించుకోవడానికి ఈ ధర్మశాస్త్రం ఇశ్రాయేలీయులను సిద్ధం చేసింది. తరువాత కాలంలో దేవుణ్ణి పూజించడానికి ప్రజలు ఆ దేవాలయానికే వెళ్లారు. బలులను గురించి, ఆరాధన గురించి ఉన్న నియమాలు, ప్రజలు తమలో తమకు, దేవునికి వ్యతిరేకంగా పాపాలు చేశామని గ్రహించేలా చేశాయి. కాని తాము క్షమించబడి, తిరిగి వారు ఒకరినొకరితోనూ, దేవునితోనూ ఐకమత్యం పొందడానికి గల చేరుకునేందుకుగల మార్గాన్ని కూడా ఈ నియమాలు ప్రజలకు ప్రసాదించాయి. సమస్త మానవాళి కోసం దేవుడు సిద్ధం చేయబోతున్న బలిదానాన్ని చక్కగా అర్థం చేసుకునేందుకుగల మార్గాన్ని ఈ బలులు సిద్ధం చేశాయి.

అనేక పవిత్ర దినాలను, లేదా పండుగలను ఆచరించే విధానాలు ఈ శాసనంలో ఉన్నాయి. ప్రతి పండుగకు ఒక ప్రత్యేకమైన అర్థం ఉంది. కొన్ని పండుగలు సంవత్సరంలో కొన్ని ప్రత్యేక సమయాలలో సంతోషంగా జరుపుకునేలాంటివి. ఉదాహరణానికి – ప్రథమ ఫలాల కోత పండుగలు, షాబువోతు (పెంతెకొస్తు లేక వారాల పండుగ), సుక్కోతు (పర్ణశాలల పండుగ).

కొన్ని పండుగలు, దేవుడు తన ప్రజల కోసం చేసిన అద్భుత కార్యాలను స్మరించుకోవడం కోసం ఏర్పడ్డాయి. పస్కా (Passover) అటువంటి పండుగే. ప్రతి కుటుంబం ఈజిప్టు నుంచి తప్పించుకొనుట ద్వారా పునర్జీవితాన్ని పొందింది. ప్రజలు దేవుని గురించి స్తుతి గీతాలు పాడారు. ఒక గొఱ్ఱె పిల్లను చంపి భోజనం సిద్ధం చేశారు. బాధతోను దుఃఖంతోనూ నిండిన జీవితాన్నుంచి తమను రక్షించడం కోసం దేవుడు చేసిన ఘన కార్యాలను ప్రతీ ద్రాక్షారసపు పాత్ర, ప్రతీ రొట్టె ముక్క ప్రజలకు జ్ఞాపకం చేశాయి.

ఇతర పండుగలు చాలా గంభీరంగా ఉండినవి. ప్రతి సంవత్సరం ప్రాయశ్చిత్తార్థ దినం (Day of Attonement) నాడు, ప్రజలు, తాము ఇతరులకు, దేవునికి వ్యతిరేకంగా చేసిన చాలా చెడ్డ పనులను జ్ఞాపకం చేసుకోవాలి. అది విషాద దినం. ఆ నాడు ప్రజలు భోజనం చేయలేదు. కాని ఆ నాడు ప్రధాన యాజకుడు, ప్రజల పాపాలను పోగొట్టడానికి లేదా వాటికి ప్రాయశ్చిత్తం చేయడానికి ప్రత్యేకమైన బలులు అర్పించేవాడు.

దేవునికీ, ఇశ్రాయేలు ప్రజలకూ మధ్య జరిగిన ఒప్పందం, పాత నిబంధన రచయితలకు చాలా ముఖ్యమైనది. ఇశ్రాయేలు జనాంగం, ఇశ్రాయేలులోని ప్రతి పౌరుడు తమ దేవునితో ఒక ప్రత్యేకమైన నిబంధన చేసుకున్నారనే వాస్తవం మీదనే, ఇంచు మించు ప్రవక్తల అన్ని పుస్తకాలూ అన్ని పవిత్ర రచనలూ ఆధారపడివున్నాయి. దీనిని వాళ్లు యెహోవా ఒడంబడిక (Covenant of the Lord) లేదా క్లుప్తంగా ఒడంబడిక (Covenant) అని అన్నారు. ఈ ఒడంబడిక వెలుగులోనే వాళ్ల చరిత్ర గ్రంథాలు సంఘటనలను వ్యాఖ్యానిస్తాయి. వారిలో ఒక వ్యక్తి లేదా ఆ జనాంగం దేవునికీ, ఒడంబడికకూ విశ్వాస పాత్రంగా ఉంటే, దేవుడు వాళ్లని ఆశీర్వదించాడు. ప్రజలు ఒడంబడికను విడిచి పెట్టేస్తే, దేవుడు వాళ్లను శిక్షించాడు. ప్రజలు తమ దేవునితో చేసుకొన్న ఒప్పందాన్ని జ్ఞాపకం చేయడం కోసం, ఆయన తన ప్రవక్తలను పంపాడు. దేవుడు తనకు విధేయులుగా ఉన్న ప్రజల కోసం చేసిన అద్భుత కార్యాలను గురించి ఇశ్రాయేలు కవులు గానం చేశారు. అలాగే దేవుణ్ణి తిరస్కరించిన ప్రజలు పొందిన బాధలను గురించి, శిక్షలను గురించి ఈ కవులు దుఃఖించారు. ఈ రచయితలు తప్పు ఒప్పు

అనే వాటి మూల భావాన్ని నిబంధన ఉపదేశం మీదనే ఆధారంగా చేసుకున్నారు. అమాయకులైన ప్రజలు బాధలు పడినప్పుడు, అలా ఎందుకు జరిగిందో అర్థం చేసుకోవడం కష్టమయ్యేది.

## ఇశ్రాయేలు ఐక్యరాజ్యం

ప్రజలు దేవుణ్ణి విడిచిపెట్టేయడం, దేవుడు ప్రజలను రక్షించడం, ప్రజలు దేవుని వైపు తిరగడం, చివరకు మళ్లీ దేవుణ్ణి పరిత్యజించడం – ఇది ప్రాచీన ఇశ్రాయేలు కథ. దేవుని ఒడంబడికను ప్రజలు అంగీకరించిన వెంటనే ఇలా జరగడం ప్రారంభమైంది. ఇది పదే పదే పునరుక్తమయింది. సీనాయి పర్వతం దగ్గర ఇశ్రాయేలు ప్రజలు దేవుణ్ణి అనుసరిస్తామని ఒప్పుకున్నారు. కాని తర్వాత వాళ్లు తిరుగబడ్డారు. ఫలితంగా నలభై ఏళ్లు ఎడారిలో తిరుగవలసిన దురవస్థ ఏర్పడింది వాళ్లకి. ఆఖరికి, మోషే సహాయకుడైన యెహోషువా (Joshua) ఆ ప్రజలను దేవుడు వాగ్దానం చేసిన దేశంలోకి తీసుకు వెళ్లాడు. వాళ్ళు ప్రప్రథమంగా జయిస్తూ వాళ్ల దేశంలో కొంత భాగాన్ని ఆక్రమించుకొన్నారు. ఇలా స్థిరపడ్డ తర్వాత మొదట కొన్ని శతాబ్దాల వరకూ ఈ ప్రజలను న్యాయాధిపతులు అనే స్థానిక నాయకులు పరిపాలించారు.

ఇలా ఉండగా ప్రజలు తమకు రాజు కావాలని కోరుకున్నారు. మొట్ట మొదటి రాజు సౌలు. కాని సౌలు దేవునికి విధేయుడు కాలేదు. అందువల్ల దేవుడు దావీదు (David) అనే గొర్రెల కాపరి కుర్రవాణ్ణి కొత్త రాజుగా ఎంచుకున్నాడు. సమూయేలు (Samuel) ప్రవక్త వచ్చి, దావీదును ఇశ్రాయేలు రాజుగా అభిషేకిస్తూ, అతని తలపై నూనె పోశాడు. యూదా జాతికి చెందిన దావీదు వంశీయులే భవిష్యత్తులో రాజులవుతారని దేవుడు వాగ్దానం చేశాడు. దావీదు యెరూషలేము (Jerusalem) నగరాన్ని జయించి, దానిని తన రాజధానిగాను, కట్టబోయే దేవాలయ స్థలంగానూ చేసుకున్నాడు. దేవాలయ ఆరాధన కోసం యాజకులను, ప్రవక్తలను, కీర్తన రచయితలను, సంగీత విద్వాంసులను, గాయకులను ఏర్పాటు చేశాడు. దావీదు స్వయంగా చాలా పాటలు (కీర్తనలు) కూడా వ్రాశాడు. కాని దేవాలయం కట్టడానికి మాత్రం దేవుడు అతనికి అనుమతివ్వలేదు.

దావీదు ముసలివాడై, చనిపోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, తన కొడుకు సొలోమోనును (Solomon) ఇశ్రాయేలుకు రాజుగా చేశాడు. ఎప్పుడూ దేవుణ్ణి అనుసరిస్తూ ఉండుమనీ, ఒడంబడికకు విధేయుడుగా ఉండుమని దావీదు తన కొడుకును హెచ్చరించాడు. రాజైన సొలోమోను దేవాలయాన్ని కట్టాడు. ఇశ్రాయేలు సరిహద్దుల్ని విస్తీర్ణ పరిచాడు. అతని కాలంలో ఇశ్రాయేలు వైభవం అత్యున్నత స్థితికి అందుకుంది. సొలోమోను ప్రసిద్ధుడయ్యాడు. ఇశ్రాయేలు పటిష్ఠమయింది.

## యూదా మరియు ఇశ్రాయేలు: విభాగింపబడిన రాజ్యం

సొలోమోను చనిపోవడంతో అంతఃకలహం వచ్చింది. జనాంగం విభక్తమయింది. ఉత్తరంలో ఉన్న పది గోత్రాలు తమ భాగాన్ని ఇశ్రాయేలు అని పిలుచుకున్నారు. దక్షిణంలో ఉన్న గోత్రాలు తమ భాగాన్ని యూదా (Judah) అని పిలుచుకున్నారు. (ఆధునికమైన యూదా అనే (Jew) శబ్దం ఈ పేరునుంచే వచ్చింది.) యూదా, ఒడంబడికకు విధేయంగా ఉండిపోయింది. దావీదు వంశం (రాజ వంశం) యెరూషలేమును పరిపాలిస్తూ వచ్చింది. చివరికి బబులోనీయులు యూదాను జయించి, దాని ప్రజలను చెఱలోనికి తీసికెళ్లారు.

ఉత్తర రాజ్యంలో (ఇశ్రాయేలు) ప్రజలు ఒడంబడికను అనుసరించక పోవడంవల్ల, అక్కడ అనేక రాజ వంశాలు వచ్చి, పోయాయి. ఇశ్రాయేలు రాజులు అనేక కాలాల్లో అనేక రాజధానులను ఏర్పాటు చేసుకున్నారు. వాటిలో ఆఖరిది సమరియా (Samaria). ప్రజల మీద తమ అధికారాన్ని నిలుపుకొనేందుకు, ఇశ్రాయేలు రాజులు దేవుణ్ణి ఆరాధించే విధానం మార్చివేశారు. క్రొత్త యాజకులను ఎంచుకున్నారు. రెండు క్రొత్త దేవాలయాలు కట్టించారు. దానులో (Dan) (ఇశ్రాయేలు ఉత్తర సరిహద్దులో) ఒక దేవాలయం, బేతేలులో (Bethel) (యూదాతో ఉన్న ఇశ్రాయేలు సరిహద్దులో) ఇంకో దేవాలయం కట్టించారు. ఇశ్రాయేలుకూ యూదాకూ మధ్య అనేక యుద్ధాలు జరిగాయి.

అంతర్యుద్ధమూ కష్టాలూ వచ్చిన ఈ కాలంలో దేవుడు అనేక ప్రవక్తలను యూదాకూ, ఇశ్రాయేలుకూ పంపించాడు. ఆ ప్రవక్తలలో కొంత మంది యాజకులు, కొందరు వ్యవసాయదార్లు. కొంత మంది రాజుకు సలహాదార్లు, కొందరు చాలా నిరాడంబర జీవితాన్ని గడిపారు. ప్రవక్తలలో కొంత మంది వాళ్ల ఉపదేశాలను, ప్రవచనాలను రచించారు, చాలా మంది వ్రాయలేదు. కాని ప్రవక్తలందరూ న్యాయాన్ని, ధర్మాన్ని ఉపదేశిస్తూ వచ్చారు. సహాయం కోసం దేవుని మీద ఆధారపడుమని చెప్పారు.

దేవుని వైపు మనస్సు మళ్ళించకపోతే ప్రజలు ఓడిపోతారనీ, చెల్లాచెదరైపోతారనీ చాలా మంది ప్రవక్తలు హెచ్చరించారు. ఈ ప్రవక్తలలో కొంత మంది రాబోయే వైభవాలనూ, రాబోయే శిక్షలనూ దర్శనాల్లో చూశారు. వాళ్లలో చాలా మంది, రాజ్యాన్ని పాలించడం కోసం ఒక కొత్త రాజు వచ్చే శుభగడియల కోసం ఎదురు చూశారు. కొంత మంది ఈ రాజును దావీదు వంశీకుడుగా చూశారు. ఈయన తన ప్రజలను ఒక కొత్త స్వర్ణ యుగంలోనికి నడిపిస్తాడని చూశారు. ఈ రాజు ఒక శాశ్వతమైన రాజ్యాన్ని ఎల్లకాలం పరిపాలిస్తాడని మరికొందరు చెప్పారు. ఇంకా కొందరు, ఆయన్ని తన ప్రజలను దేవుని దగ్గరకు తీసుకురావడానికి అనేక కష్టాలు పడే సేవకుడిగా చూశారు. కాని అందరు కూడా, ఆయన్ని, కొత్త యుగాన్ని తీసుకురావడం కోసం దేవుడు ఎంచుకున్న అభిషిక్తునిగా (Messaiah) గా చూశారు.

## ఇశ్రాయేలు యూదాల ధ్వంసం

ఇశ్రాయేలు ప్రజలు దేవుని హెచ్చరికలు లెక్క చేయలేదు. అందువల్ల క్రీ.పూ. 722-721 లో అష్షూరీయుల (Assyrians) దండయాత్రలో సమరియా లొంగిపోయింది. ఇశ్రాయేలు ప్రజలను వాళ్ల ఇళ్లలోనుంచి వెలుగా తీసుకెళ్లారు. వాళ్లను అష్షూరు సామ్రాజ్యమంతటా చెదరగొట్టారు. ఈ విధంగా వాళ్లు యూదాలోని తమ అన్నదమ్ముల నుంచీ, అక్క చెల్లెళ్లనుంచీ శాశ్వతంగా దూరమయిపోయారు. అప్పుడు అష్షూరీయులు ఇశ్రాయేలు భూమి మీద స్థిర నివాసం ఏర్పరచడానికి విదేశీయుల్ని తీసుకువచ్చారు. ఈ ప్రజలకు యూదాలోను, ఇశ్రాయేలులోనూ ఉన్న మతాన్ని గురించి బోధించారు. ఈ ప్రజలకు సమరయులు (Samaritans) అని పేరు వచ్చింది. అష్షూరీయులు యూదాను ముట్టడించడానికి ప్రయత్నించారు. చాలా నగరాలు ఆక్రమదారుల వశమయ్యాయి. కాని దేవుడు యెరూషలేమును రక్షించాడు. ఓడిపోయిన అష్షూరీయుల రాజు స్వదేశానికి పారిపోయాడు. అక్కడ అతని ఇద్దరు కొడుకులూ కలిసి అతన్ని హత్య చేశారు. అందువల్ల యూదా రక్షించబడింది.

కొద్ది రోజులుగా యూదా ప్రజలు మారిపోయి, దేవునికి విధేయులుగా ఉండటం ప్రారంభించారు. కాని వాళ్లు కూడా చివరికి ఓడిపోయి, చెల్లాచెదరయ్యారు. బబులోను (Babylon) దేశం అధికారానికి వచ్చి, యూదాను ముట్టడించింది. మొట్ట మొదట వాళ్లు కొద్దిమంది ముఖ్యులను మాత్రమే బందీలుగా తీసుకుపోయారు. కాని కొద్ది ఏళ్ల తర్వాత, క్రీ.పూ. 587-586 లో, వాళ్లు తిరిగి వచ్చి, యెరూషలేమునూ, దేవాలయాన్ని ధ్వంసం చేశారు. కొంత మంది ఈజిప్టుకు పారిపోయారు. కాని వాళ్లలో చాలా మంది బబులోనుకు బానిసలుగా తీసుకుపోబడ్డారు. మళ్లీ దేవుడు తన ప్రజల దగ్గరకు ప్రవక్తలను పంపించాడు. ప్రజలు వినడం మొదలు పెట్టారు. దేవాలయమూ, యెరూషలేమూ ధ్వంసం కావడం, బబులోనులో ప్రవాసం, ప్రజల్లో నిజమైన మార్పును తెచ్చింది. కొత్త రాజును గురించీ, ఆయన రాజ్యాన్ని గురించీ, ప్రవక్తలు పదే పదే చెప్పడం మొదలు పెట్టారు. ఆ ప్రవక్తలలో ఒకడైన యిర్మీయా (Jeremiah) క్రొత్త నిబంధనను గురించి కూడా చెప్పాడు. ఈ క్రొత్త నిబంధన రాతి పలకల మీద వ్రాయబడదు, గాని దైవ జనుల హృదయాల్లో వ్రాయబడుతుంది.

## పాలస్తీనాకు యూదుల రాక

ఈ లోగ మాదీయపారసీక సామ్రాజ్యానికి కోరెషు చక్రవర్తి అయ్యాడు. అతడు బబులోనును జయించాడు. బానిస ప్రజలు తిరిగి తమ మాతృ దేశాలకు వెళ్లిపోవడానికి అతడు అంగీకరించాడు. కాబట్టి, డెబ్బై ఏళ్ల ప్రవాసం తర్వాత, యూదా ప్రజల్లో చాలా మంది తిరిగి తమ దేశానికి వెళ్లిపోయారు. వాళ్లు తమ జనాంగాన్ని పునర్నిర్మించడానికి యత్నించారు. కాని యూదా చిన్నదిగానూ, బలహీనంగానూ ఉండిపోయింది. ప్రజలు మళ్లీ దేవాలయాన్ని కట్టారు. కాని అది పూర్వం సొలోమోను కట్టినంత అందంగా లేదు. చాలా మంది ప్రజలు దేవునికి నిజమైన భక్తులయ్యారు. వాళ్లు ధర్మశాస్త్రం, ప్రవక్తల రచనలు, ఇతర పవిత్ర రచనలు చదవడం మొదలు పెట్టారు. చాలా మంది మనుష్యులు, పవిత్ర రచనలకు నకళ్లు తీసే లేఖకులు (విశిష్ట పండితులు)గా మారారు. చిట్టచివరికి పవిత్ర రచనలు చదవడం కోసం ఈ మనుష్యులు పాఠశాలలు కూడా నిర్వహించారు. ప్రజలందరూ కలసి చదవడం కోసం, ప్రార్థించడం కోసం, దేవుణ్ణి ఆరాధించడం కోసం, సబ్బాతు (శనివారం) నాడు కలవడం మొదలు పెట్టారు. చాలా మంది లోకరక్షకుడు (Messiah) వస్తాడని ఎదురు చూడడం మొదలు పెట్టారు.

పడమటి దిక్కున, గ్రీసు దేశంలో మహావీరుడు అలెగ్జాండర్ అధికారానికి వచ్చాడు. అతడు త్వరలోనే ప్రపంచాన్ని జయించాడు. అతడు గ్రీకు భాషను, గ్రీకు ఆచారాలను, గ్రీకు సంస్కృతిని ప్రపంచంలో అనేక భాగాలకు వ్యాపింపజేశాడు. అతడు చనిపోయిన తర్వాత, అతని సామ్రాజ్యం విభజింపబడింది. త్వరలోనే మరో సామ్రాజ్యం తలయెత్తి, ఆనాటి ప్రపంచంలోని చాలా భాగాన్ని స్వాధీనం చేసుకుంది. యూదా ప్రజలు నివసించే పాలస్తీనా కూడా దాంట్లోనే చేరింది. అది రోమా సామ్రాజ్యం.

కొత్త పాలకులైన రోమన్లు తరచుగా క్రూరంగానూ కఠినంగానూ ప్రవర్తించే వారు. గర్విష్టులైన యూదులు ఎదురు తిరిగే వారు. ఇటువంటి కష్టకాలంలో లోకరక్షకుడు తమ జీవిత కాలంలోనే రావాలని ఎదురు చూసే యూదులు చాలా మంది ఉండేవారు. దేవుడూ, ఆయన పంపుతానని వాగ్దానం చేసిన లోకరక్షకుడు (క్రీస్తు) మాత్రమే తమను పరిపాలించాలని యూదులు కోరుకున్నారు. లోకరక్షకుని ద్వారా దేవుడు సమస్త ప్రపంచాన్నీ రక్షించబోతున్నాడని వాళ్లు తెలుసుకో లేకపోయారు. ప్రపంచంలో యూదులను రక్షించడమే దేవుని ప్రణాళిక అని వాళ్లు భావించారు. దేవుడు లోకరక్షకుణ్ణి పంపేవరకూ నిరీక్షించడంతో కొంత మంది యూదులు సంతృప్తిపడ్డారు. కాని ఇతరులు దేవుడు తన రాజ్యాన్ని స్థాపించడంలో ఆయనకి సహాయం చేయడానికి నిశ్చయించుకున్నారు. ఈ యూదులు జెలోతేయులు (Zealots) అని పిలువబడ్డారు. ఈ జెలోతేయులు రోమన్లతో యుద్ధం చేయడానికి యత్నించారు. అంతే కాదు, రోమన్లకు సహాయం చేసిన ఇతర యూదుల్ని కూడా చాలా సార్లు చంపి వేశారు.

## యూదుల మత వర్గాలు

క్రీస్తు పూర్వం ఒకటవ శతాబ్దంనాటికి, యూదులకు మోషే ధర్మశాస్త్రం చాలా ముఖ్యమైనదిగా పరిణమించింది. ప్రజలు ఆ శాసనాన్ని అధ్యయనం చేశారు, చర్చించారు. ఆ శాసనాన్ని ప్రజలు అనేక విధాలుగా అర్థం చేసుకున్నారు. కాని చాలా మంది యూదులు ఆ శాసనం కోసం ప్రాణ త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డారు. యూదుల్లో మూడు ప్రధానమైన మత వర్గాలుండేవి. ప్రతి వర్గంలోనూ లేఖకులు (న్యాయవాదులు లేదా పండితులు) ఉండేవారు.

### సద్దూకయ్యులు (Sadducees)

ఆ వర్గాల్లో ఒక దానిని సద్దూకయ్యులు అనే వారు. ఈ పేరు బహుశః దావీదు రాజు కాలంలో ఉన్న సాదోకు (Zadok) పేరు నుంచి వచ్చి ఉండవచ్చు. యాజకుల్లోనూ చాలా మంది సద్దూకయ్యులే. ఈ మనుష్యులు మత విషయాల్లో ధర్మశాస్త్రాన్ని (మోషే ఐదు పుస్తకాలను) మాత్రమే తమకు ప్రమాణంగా అంగీకరించేవారు. ఈ ధర్మశాస్త్రం యాజకుల్ని గురించి, బలుల్ని గురించి, అనేక విషయాలు బోధించింది. కాని అది మరణాంతర జీవితాన్ని గురించి ఏమీ చెప్ప లేదు. కాబట్టి ప్రజలకు చావు తరువాత పునరుత్థానం ఉంటుందనే విషయాన్ని సద్దూకయ్యులు నమ్మలేదు.

### పరిసయ్యులు (Pharisees)

ఇంకోవర్గాన్ని పరిసయ్యులు అనే వారు. ఈ పేరు వ్యాఖ్యానించు (వివరించు) లేదా ప్రత్యేకించు అనే అర్థానిచ్చే ఒక హీబ్రూ పదాన్నుంచి వచ్చింది. ఈ మనుష్యులు మోషే ధర్మశాస్త్రాన్ని సామాన్య ప్రజలకు బోధించడానికి లేదా వ్యాఖ్యానించడానికి ప్రయత్నించారు. మోషే కాలం నుంచి ఒక మౌళిక సంప్రదాయం ఉండేదని ఈ పరిసయ్యులు నమ్మారు. ప్రతి తరంలోని మనుష్యులూ ధర్మశాస్త్రాన్ని ఆ తరం మనుష్యుల అవసరాలను తీర్చేందుకు వీలుగా వ్యాఖ్యానించవచ్చని వీళ్లు నమ్మారు. దీని అర్థం ఏమిటంటే - పరిసయ్యులు, మోషే ధర్మశాస్త్రాన్ని తమ వేదంగా భావించడం మాత్రమే కాకుండా, ప్రవక్తలను, పవిత్ర రచనలను, వాళ్ల సొంత సాంప్రదాయాలను కూడా అంగీకరించారు. వీళ్లు ధర్మశాస్త్రాన్ని, వాళ్ల సాంప్రదాయాలను ఆచరించడానికి చాలా కఠినంగా ప్రయత్నించారు. అందుచేత వాళ్లు ఏమి తిన్నారో, ఏమి ముట్టుకున్నారో అనే విషయాలను గురించి చాలా జాగ్రత్త వహించారు. వాళ్లు తమ చేతులు కడుక్కోవడం గురించీ, స్నానం చేయడం గురించీ జాగ్రత్త పడ్డారు. ప్రజలకు మరణానంతరం పునరుత్థానం ఉందని చెప్పడం ప్రవక్తల ఉపదేశాల ద్వారా గ్రహించారు.

### ఎస్సీనీయులు (Essenes)

మూడవ వర్గం ఎస్సీనీయులు. యెరూషలేములో ఉన్న యాజకుల్లో చాలా మంది దేవుడు కోరిన రీతిలో బ్రతుకలేదు. పైగా, ప్రధాన యాజకుల్లో చాలా మందిని రోమన్లు నియమించారు. మోషే ధర్మశాస్త్రం ప్రకారం చూస్తే, వీళ్లలో కొంత మంది అర్హులు కారు. దీనిని బట్టి, ఎస్సీనీయులు యెరూషలేములో ఆరాధనలు, బలులు సరిగ్గా జరుగుతున్నాయని భావించలేదు. అందువల్ల వాళ్లు ఆ ప్రదేశాన్ని విడిచి యూదయ (Judah) ఎడారిలోకి నివసించడానికి వెళ్లిపోయారు. ఇతర ఎస్సీనీయులు మాత్రమే వచ్చి వాళ్లతో ఉండేలా అక్కడ తమ సొంత తెగను ఏర్పాటు చేసుకున్నారు. ఎస్సీనీయులు ఉపవాసాలు, ప్రార్థనలు చేశారు, దేవుడు లోకరక్షకుణ్ని పంపుతాడనీ, దేవాలయాన్నీ, యాజకుల్ని పవిత్రం చేయిస్తాడనీ ఎదురు చూశారు. ఈ ఎస్సీనీయులు ఆ కాలంలోవున్న కుమ్రాను సమాజానికి సంబంధించినవారని, కుమ్రాను మరియు యూదా ఎడారి ప్రాంతంలోనున్న ఇతర స్థలాల్లో దొరికిన చాలా ప్రాచీన ప్రతులు ఎస్సీనీయులకు సంబంధించినవే అని చాలామంది బైబల్ పండితులు నమ్ముతారు.

## కొత్త నిబంధన (New Testament)

దేవుడు తన ప్రణాళికను మొదలు పెట్టాడు. ఒక విశిష్టమైన జనాంగాన్ని ఎంచుకున్నాడు. ఆ ప్రజలతో ఒక ఒప్పందం చేసుకున్నాడు. ఆ ఒప్పందం తన న్యాయాన్ని, తన మంచితనాన్ని, ప్రజలు అర్థం చేసుకునేలా చేయగలదు. ఈ కొత్త ఉత్తమమైన ఒప్పందం మీద ఆధారపడిన ఒక పరిపూర్ణ ఆధ్యాత్మిక రాజ్యాన్ని స్థాపించి, దాని ద్వారా ఈ ప్రపంచాన్ని ఆశీర్వదించాలని ఆయన ఉద్దేశ్యం. తన ఈ ప్రణాళికను ప్రవక్తల మూలకంగానూ, కవుల మూలకంగానూ వెల్లడించాడు. వాగ్దానం చేయబడిన లోకరక్షకుడి రాకతో ఈ ప్రణాళిక ప్రారంభమౌతుంది. ఆయన రాకను గురించి ప్రవక్తలు చాలా వివరంగా చెప్పారు. ఈ లోకరక్షకుడు ఎక్కడ పుడతాడో, ఆయన ఎలాంటివాడో, ఆయన చేయవలసిన పని ఏమిటో – అన్నీ చెప్పారు వాళ్లు. అప్పుడు లోకరక్షకుడు వచ్చి కొత్త ఒడంబడిక ప్రారంభించవలసిన సమయం వచ్చింది.

యేసు అనే క్రీస్తు (అంటే అభిషేకం చేయబడ్డవాడు, లోకరక్షకుడు) దేవుని కొత్త ఒడంబడికను ఎలా ప్రకటించాడో, ఎలా ఆచరణలో పెట్టాడో కొత్త నిబంధన రచనలు వర్ణిస్తాయి. ఇవి ఈ కొత్త ఒడంబడిక ప్రజలందరి కోసం అని బోధిస్తాయి. మొదటి శతాబ్దంలో ప్రజలు దయతో కూడిన దేవుని ప్రేమా సమర్పణకు ఎలా స్పందించారో, కొత్త ఒడంబడికలో ఎలా భాగస్వాములయ్యారో అవి చెపుతాయి. ఈ ప్రపంచంలో ఎలా బ్రతకాలో దేవుని ప్రజలకు సూచనలిస్తాయి ఈ రచనలు. ఇక్కడ సంపూర్ణమూ అర్థవంతమూ అయిన జీవితం కోసం, మరణానంతరం ఆయనలోవుండే జీవితం కోసం, దేవుడు తన ప్రజలకు వాగ్దానం చేసే ఆశీస్సులను కూడా ఈ రచనలు వర్ణిస్తాయి.

కొత్త నిబంధన రచనలలో కనీసం ఎనిమిది మంది విభిన్న రచయితల ఇరవై యేడు విభిన్న పుస్తకాలు ఉన్నాయి. వీటన్నింటినీ కూడా గ్రీకు భాషలో వ్రాశారు. మొదటి శతాబ్దపు ప్రపంచంలో ఎక్కువ ప్రాంతాల్లో ఎక్కువ మంది ఆ భాష మాట్లాడే వారు. మొత్తం రచనల్లో సగంకన్నా ఎక్కువ భాగాన్ని నలుగురు అపొస్తలులు వ్రాశారు. వీళ్లని యేసు తన విశిష్ఠ ప్రతినిధులుగా లేదా సహాయకులుగా ఎంచుకున్నాడు. వీళ్లల్లో ముగ్గురు – మత్తయి (Mathew), యోహాను (John), పేతురు (Peter). యేసు భూమి మీద బ్రతికి ఉన్నప్పుడు వీళ్లు ఆయనతో ఉన్న పన్నెండు మంది సన్నిహిత అనుచరులలోని వాళ్లు. పౌలు అనే ఇంకో రచయితను, తరువాతి కాలంలో, ఒక అద్భుత దర్శనం ద్వారా, అపోస్తులునిగా యేసు ఎన్నుకున్నాడు.

మొదటి నాలుగు పుస్తకాలను సువార్తలు (Gospels) అంటారు. ఇవి యేసు క్రీస్తు జీవితాన్ని గురించీ, మరణాన్ని గురించీ ఉన్న ప్రత్యేక వివరణలు. ఇవి కేవలం యేసు జీవితానికి సంబంధించిన చారిత్రక సంఘటనలు మాత్రమే కావు. సాధారణంగా, యేసు ప్రబోధం, భూమి మీద ఆయన నరావతార ఉద్దేశ్యం, అతి ప్రధానమైన ఆయన మరణం అనే విషయాలను ఈ పుస్తకాలు ఒత్తి చెపుతాయి. ముఖ్యంగా యోహాను సువార్త విషయంలో ఇది సత్యం. మొదటి మూడు సువార్తల సందేశ విషయంలో సమానంగా ఉన్నాయి. నిజానికి, ఒకదాంట్లో ఉన్న విషయంలో చాలా భాగం మరోదాంట్లో కాని, మిగిలిన రెండిట్లో కాని ఉంటుంది. అయినా ప్రతి రచయిత ఒక విభిన్నమైన వర్గం కోసం వ్రాస్తున్నాడు. అతని దృష్టిలో ఒక వర్గం వారిని ఉంచుకొని అదే సందేశాన్ని వేరుగా వ్రాస్తున్నాడు.

పై నాలుగు సువార్తల తరువాత అపోస్తులుల కార్యముల పుస్తకం (Acts) ఉంది. ఇది యేసు మరణించాక సంభవించిన సంఘటనల చరిత్ర. యేసు అనుచరులు, ప్రజలందరికీ దేవుడు చూపిన ప్రేమను గురించి ప్రపంచమంతటా ఎలా ప్రకటించారో ఈ పుస్తకం వివరిస్తుంది. ఈ “సువార్తను” లేక “శుభవార్తను” ప్రకటించడం వల్ల, పాలస్తీనాలోనూ, రోమా ప్రపంచంలోనూ క్రైస్తవ మత విశ్వాసాన్ని అంగీకరించడం ఎలా విస్తృతంగా వ్యాపించిందో ఈ పుస్తకం చెపుతుంది. ఈ అపొస్తలుల కార్యాలు అనే పుస్తకాన్ని లూకా (Luke) వ్రాశాడు. అతడు వ్రాసిన దాంట్లో ఎక్కువ భాగానికి అతడు ప్రత్యక్ష సాక్షి. మూడవ సువార్తకు కూడా లూకా గ్రంథకర్త. అతని రెండు గ్రంథాలూ కలిసి ఒక చక్కని తర్కబద్ధమైన సంపుటిగా ఉన్నాయి. అతడు యేసు జీవితాన్ని వివరించాక, దానికి సహజమైన క్రమములో అపొస్తలుల కార్యాలు అనే పుస్తకమున్నది. ఈ పుస్తకం తర్వాత క్రైస్తవ వ్యక్తులకు లేదా గుంపులకు వ్రాసిన లేఖల సంపుటం ఉంది. ఈ లేఖలు యేసు అపొస్తలుల్లో ఇద్దరైన పౌలు, పేతురు వంటి క్రైస్తవ నాయకులు పంపినవి. ఆనాటి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి సహాయపడేలా ఈ లేఖలు వ్రాశారు. విశ్వాసం, సామాజిక జీవితం – వీటిని గురించి ఆనాటి ప్రజలకు మాత్రమే కాకుండా అన్ని కాలాల్లో ప్రపంచంలోవున్న అందరికీ తెలియజెపుతాయి ఈ లేఖలు. మనుష్యుల్ని సరిదిద్దడంలోను, ప్రోత్సహించడంలోను, బోధించడంలోను ఈ లేఖలు సహాయపడుతాయి.

కొత్త నిబంధనలోని చివరి పుస్తకం ప్రకటన గ్రంథం (Revelation). ఇది ఇతర పుస్తకాలన్నిటికన్నా భిన్నమైనది. దీంట్లో ఎక్కువగా అలంకారికమైన శైలి ఉంటుంది. దీని రచయిత అయిన యోహాను చూసిన దివ్య దర్శనాలను గురించి ఇది చెపుతుంది. దీంట్లో ఉన్న అలంకారాలు, భావ చిత్రాలు పాత నిబంధన లోనివి. పాత నిబంధన రచనలతో వీటిని పోల్చినప్పుడే ఇది బాగా అర్థమౌతాయి. దేవుని మహిమవల్ల, క్రైస్తవులు దుష్టశక్తుల మీద అంతిమ విజయాన్ని సాధిస్తారని ఈ ఆఖరి పుస్తకం నిశ్చయంగా చెపుతోంది.

## బైబిల్ - ఆధునిక పాఠకుడు

ఈ పుస్తకాలు, మన సంస్కృతికి భిన్నమైన సంస్కృతిగల ప్రజల కోసం, వేలాది సంవత్సరాలకు పూర్వం వ్రాయబడ్డాయని ఈనాడు బైబల్ చదివే వ్యక్తి గుర్తు పెట్టుకోవాలి. ఆనాటి వాళ్లు జీవించిన కాలాన్నీ సంస్కృతిని తెలుసుకోవడం వల్లనే చాలా చారిత్రక సంఘటనలు, వాళ్లు ఉపయోగించిన ఉదాహరణలు, వాళ్లు చేసిన సూచనలు కొంత వరకు అర్థం చేసుకోవడానికి వీలుంది. అయినా సాధారణంగా ఈ వ్రాతలను సార్వత్రిక సత్యాలైన సూత్రాల మీదనే కేంద్రీకరించారు. ఉదాహరణానికి, వేర్వేరు నేలలు గల పొలంలో విత్తిన రైతు కథను యేసు చెప్పాడు. ఆ వేర్వేరు నేలల పరిస్థితులు ఈనాటి వ్యక్తికి తెలియక పోవచ్చు. కాని ఈ ఉదాహరణాన్నుంచి, యేసు బోధించిన పాఠం అన్ని సమయాల్లో, అన్ని స్థలాల్లో ఉన్న ప్రజలందరికి సరిపోతుంది. ఆధునిక పాఠకుడికి బైబిల్ ప్రపంచం ఏదో కొంత కొత్తగా కనిపించవచ్చు. ఆచారాలు, దృక్పథాలు, ప్రజలు మాట్లాడే తీరు పూర్తిగా అపరిచితం కావచ్చు. ఆ విషయాలను, ఆధునిక ప్రమాణాలతో కాకుండా, ఆనాటి దేశ కాల ప్రమాణాలతో పరిశీలించడం మాత్రమే సమంజసంగా ఉంటుంది. బైబల్ విజ్ఞాన శాస్త్రగ్రంథంగా వ్రాయబడలేదని గుర్తించడం కూడా చాలా ముఖ్యం. ప్రధానంగా చారిత్రక సంఘటనలు వర్ణించి, మానవజాతికి ఆ సంఘటనల ప్రాముఖ్యాన్ని ప్రదర్శించడం కోసం దీనిని వ్రాశారు. దీని ఉపదేశాలు, విజ్ఞాన శాస్త్ర పరిధికన్నా అతీతమైన సార్వత్రిక సత్యాలతో కూడి ఉంటాయి. ఇది ఈ ఆధునిక యుగానికి సహితం సంబంధించి ఉంటుంది. ఎందుచేతనంటే, ఇది, ఎప్పటికీ మారని, ప్రజల ప్రాథమిక ఆధ్యాత్మిక అవసరాలను గురించి చర్చిస్తుంది.

ఒక గురి పెట్టుకొని బైబిల్ చదివే ఏ వ్యక్తి అయినా సరే చాలా లాభాలు పొందే అవకాశం ఉంది. అతడు ప్రాచీన ప్రపంచ చరిత్ర సంస్కృతులను గురించిన జ్ఞానాన్ని సంపాదిస్తాడు. యేసు క్రీస్తు జీవితం, ఉపదేశాల గురించి అతడు తెలిసికొంటాడు. తద్వారా క్రీస్తు అనుచరుడంటే ఏమిటో అర్థమౌతుంది. ప్రాథమిక, ఆధ్యాత్మిక, అంతర్దర్శన లాభాన్ని పొందగలుగుతాడు. చైతన్యవంతమూ, సంతోషభరితమూ అయిన జీవితాన్ని జీవించడానికి ప్రయోగాత్మక పాఠాలు నేర్చుకోగలుగుతాడు. జీవితంలోని అతి కష్టమైన ప్రశ్నలకు అతడు సమాధానాలు కనుక్కోగలుగుతాడు. అందుచేత, ఈ పుస్తకాన్ని చదవటానికి చాలా మంచి కారణాలున్నాయి. పక్షపాతరహితమైన ఆసక్తికరమైన బుద్ధితో దీనిని చదివిన వ్యక్తి, తన జీవితానికి దేవుడు ఉద్దేశించిన ప్రయోజనాన్ని కనుక్కోగలిగే అవకాశం ఉంది.